

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 350 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 21, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

మెగా వ్యాపారులు.. వేల కోట్లు!

- మెగా ఆస్తుల సంపాదనపై అనుమానాలు
- తెలంగాణ రాష్ట్రంలో వ్యాపార స్థాపకుడు
- ప్రత్యేక రాష్ట్ర తెలంగాణలో వ్యాపారవేత్తల రారాజు
- తెలంగాణలో స్థిరపడ్డ అత్యంత ధనవంతుడు మెగా కృష్ణారెడ్డి
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక వేగంగా పెరిగిన మెగా ఆస్తులు
- ఇతర దేశాల నుండి పెద్ద ఎత్తున నిధుల పెట్టుబడులు తెచ్చినట్లు సమాచారం
- మెగా ఆస్తులపై పలమార్లు విచారణ జరిగిన బయటకు పొక్కలేదు
- మెగా ఆస్తులపై మెగా వ్యాపారాలపై సమగ్ర విచారణ జరగాలి
- వ్యాపార రంగమే కాకుండా మీడియా రంగాన్ని కూడా శాసిస్తున్నారు
- పెట్టుబడులు ప్రభుత్వ కాంట్రాక్టులు అన్ని తనకబంధహస్తాల్లోనే
- మెగా వ్యాపారాల్లో రాజకీయ పాలకుల హవా : డాక్టర్ బరిగెల శివ


తెలంగాణలో మేఘా ఇంజనీరింగ్ వ్యాపార సామ్రాజ్యం అనూహ్యంగా విస్తరించింది. 1989లో చిన్న సంస్థగా ప్రారంభమైన కంపెనీ నేడు లక్ష కోట్ల విలువైన గ్రూపుగా ఎదిగిందనే అంచనాలు ఆసక్తి రేపుతున్నాయి. అంతర్జాతీయ పెట్టుబడుల రూపంలో వేల కోట్ల నిధుల సమీకరణ చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వాల నుంచి భారీ ప్రాజెక్టులు, కాంట్రాక్టులు దక్కించుకోవడంలో సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులతో మేఘా సంస్థ పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. కంపెనీ ఆస్తులు, అప్పులు, పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలపై అనేక ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. రూ.6,540 కోట్ల పెట్టుబడుల వెనుక ఉన్న ఒప్పందాలు ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజాధనంతో నిర్మించే ప్రాజెక్టుల కాంట్రాక్టుల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి. రాజకీయ నాయకుల ఆస్తులపైనే కాకుండా భారీ కాంట్రాక్టులు పొందుతున్న సంస్థల ఆర్థిక లావాదేవీలపైనా సమగ్ర పరిశీలన జరగాలి. మేఘా వ్యాపార సామ్రాజ్యం ఎదుగుదల వెనుక ఉన్న అసలు ఆర్థిక లెక్కలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. - హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

వివరాలు 2లో

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నాగేష్‌తో డా. బరిగెల శివ మర్యాదపూర్వక భేటీ

హైద్రాబాద్, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నాగేష్‌ను డా. బరిగెల శివ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని హైకోర్టులో జస్టిస్ భీమపాక నాగేష్ ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీలో ఆయనకు మొక్కను అందించి ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఉన్నత న్యాయస్థానంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జస్టిస్ భీమపాక నాగేష్‌ను కలవడం ఎంతో సంతోషంగా, గౌరవంగా ఉందని డా. బరిగెల శివ పేర్కొన్నారు. ఈ ఆత్మీయ కలయికలో పరస్పర గౌరవాభిమానాలు పంచుకున్నారు. డా. బరిగెల శివ జై భీమ్ టీవీ ఫౌండర్ అండ్ చైర్మన్‌గా, ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులుగా కొనసాగుతున్నారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.



కేసీఆర్ నా కథలో రావణాసురుడు..

- కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లీడర్: సీఎం రేవంత్
- మాజీ సీఎం కేసీఆర్‌ను రావణాసురుడితో పోల్చిన సీఎం రేవంత్
- కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడని ఘాటు విమర్శ
- తెలంగాణలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని స్పష్టీకరణ
- బీజేపీకి పాత్ర లేదు, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రతిపక్షమన్న సీఎం
- తెలంగాణకు ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోను ఆహ్వానిస్తామని వెల్లడి

2



రెండు దశాబ్దాల అనుబంధానికి ఆత్మీయ గుర్తు..

- చుక్కా రామయ్య సార్‌తో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న డా. బరిగెల శివ
- విద్యారంగానికి చుక్కా రామయ్య అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం : డా. బరిగెల శివ

7



మాదిగ జాతి హక్కుల కోసం మూడు దశాబ్దాల పోరాటం...

- నేడు అనారోగ్యంతో ఆసుపత్రి మంచంపై!.. మేరీ మాదిగను ఆదుకుందాం...
- జాతి కోసం పోరాడిన బిడ్డకు అండగా నిలుద్దాం!

7

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది: కిషన్ రెడ్డి


- రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీ 8 ఎంపీలు గెలిచిందన్న కిషన్‌రెడ్డి
- ఇటీవల రెండు ఎమ్మెల్సీల్లోనూ బీజేపీ విజయం సాధించిందని వెల్లడి
- రాబోయే రెండు ఎమ్మెల్సీలపైనా కేంద్ర మంత్రి ధీమా
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శ
- రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ఓట్లు పడవని జోస్యం

వివరాలు 2లో

జై భీమ్ తెలుగు దినపత్రిక
సమస్యలపై సమరంగా
POWER OF PEOPLE
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు అవకాశం.. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు



హాసన్‌పర్తి, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి మండలంలోని అర్హులైన కుటుంబాలు దరఖాస్తు చేసుకోవాలని హాసన్‌పర్తి ఎంపీడీఓ సుమనా వాణి సూచించారు. మండలంలోని తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లో కుటుంబాన్ని పోషించే వ్యక్తి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటే ఈ పథకానికి అర్హులుగా పేర్కొన్నారు. అర్హులైన ప్రజలకు పథకం అందించేందుకు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రత్యేక దరఖాస్తు శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు), ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్ వెంట తీసుకెళ్లి తమ గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుమనా వాణి పత్రికా ప్రకటన ద్వారా కోరారు.

కేసీఆర్ నా కథలో రావణాసురుడు..

కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లీడర్: సీఎం రేవంత్
మాజీ సీఎం కేసీఆర్‌ను రావణాసురుడితో పోల్చిన సీఎం రేవంత్
కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడని ఘాటు విమర్శ
తెలంగాణలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని స్పష్టీకరణ
బీజేపీకి పాత్ర లేదు, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రతిపక్షమన్న సీఎం
తెలంగాణకు ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోను ఆహ్వానిస్తామని వెల్లడి

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై, ఆయన కుమారుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తన కథలో 'రావణాసురుడు'గా అభివర్ణించిన రేవంత్, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడంటూ కొట్టిపారేశారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని, కేటీఆర్‌ను తాను అంత సీరియస్‌గా పరిగణించడం లేదని రేవంత్ స్పష్టం చేశారు. "కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు. తండ్రి అండతోనే ఆయన లీడర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి, ఆయన్నే నేను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తాను" అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేసిన రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగనిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో, గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, త్వరలో క్రిస్టియానో రొనాల్డోను తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ అప్పులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, లోక్‌సభ సీట్ల పునర్విభజన వంటి అంశాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్రంలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' గురించి కూడా మాట్లాడారు.

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది: కిషన్ రెడ్డి

రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీ 8 ఎంపీలు గెలిచిందన్న కిషన్‌రెడ్డి
ఇటీవల రెండు ఎమ్మెల్సీల్లోనూ బీజేపీ విజయం సాధించిందని వెల్లడి
రాబోయే రెండు ఎమ్మెల్సీలపైనా కేంద్ర మంత్రి ధీమా
కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శ
రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ఓట్లు పడవని జోస్యం

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో ఇకపై భారతీయ జనతా పార్టీ అసలైన ఆట ప్రారంభమవుతుందని సంచలన ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం నిశ్చయమైన రాజకీయ మార్పును బలంగా ఆకాంక్షిస్తున్నారని, ఆ మార్పును నిజం చేసే సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొడుతూ ఎన్నికల గణాంకాలను కిషన్ రెడ్డి ప్రస్తావించారు. "రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాతే రాష్ట్రంలో బీజేపీ ఏకంగా 8 లోక్‌సభ స్థానాలను దక్కించుకుంది. అంతేకాకుండా ఇటీవల జరిగిన రెండు శాసనమండలి (ఎమ్మెల్సీ) స్థానాల్లోనూ కాషాయ జెండానే రెపరెపలాడింది. త్వరలో జరగబోయే మరో రెండు ఎమ్మెల్సీ స్థానాలను సైతం బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయం" అని ఆయన కుండబద్దలు కొట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై ప్రజల్లో తీవ్ర అసహనం గూడుకట్టుకుందని ఆయన ఆరోపించారు. ఆ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారని, రాబోయే రోజుల్లో వాటికి ఓటు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి, ప్రజా ఆకాంక్షల సాకారం నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కమలం వికసించడం తథ్యమని కిషన్ రెడ్డి తేల్చిచెప్పారు.

మెగా "వ్యాపారాలు" వేల కోట్లు



మెగా ఆస్తుల సంపాదనపై అనుమానాలు
తెలంగాణ రాష్ట్రంలో వ్యాపార స్థాపకుడు
ప్రత్యేక రాష్ట్ర తెలంగాణలో వ్యాపారవేత్తల రారాజు
తెలంగాణలో స్థిరపడ్డ అత్యంత
ధనవంతుడు మెగా కృష్ణారెడ్డి
ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక వేగంగా పెరిగిన మెగా ఆస్తులు
ఇతర దేశాల నుండి పెద్ద ఎత్తున నిధుల
పెట్టుబడులు తెచ్చినట్లు సమాచారం
మెగా ఆస్తులపై పలమార్లు విచారణ జరిగిన
బయటకు పొక్కలేదు
మెగా ఆస్తులపై మెగా వ్యాపారాలపై
సమగ్ర విచారణ జరగాలి
వ్యాపార రంగమే కాకుండా మీడియా
రంగాన్ని కూడా శాసిస్తున్నారు
పెట్టుబడులు ప్రభుత్వ కాంట్రాక్టులు అన్ని
తనకబంధహస్తాల్లోనే
మెగా వ్యాపారాల్లో రాజకీయ పాలకుల హవా
డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాష్ట్రంలో స్థిరపడ్డ కోటేశ్వరులలో మెగా కృష్ణారెడ్డి సుప్రసిద్ధుడని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలంలోని డోకిపర్రు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి 1989లో తన మామ పిపి రెడ్డితో కలిసి స్థాపించిన (ఎంఈఐఎల్) మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ ద్వారా స్థాపించిన సంస్థకు మేనేజర్ గా పనిచేసి తన వ్యాపార రంగాన్ని ప్రారంభించి అంచలంచలుగా ఎదుగుతూ తిరుగులేని వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించుకున్నారని తెలిపారు. కాలేశ్వరం ప్రాజెక్టు లాంటి మెగా ప్రాజెక్టును కాంట్రాక్ట్ ద్వారా పొందుకోవడంతో తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా మెగా కృష్ణారెడ్డి పేరు మారుమోగి పోయిందని ఈ సందర్భంగా తెలిపారు. పలు వ్యాపార రంగాల సంస్థలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని పలు కంపెనీలను కొనుగోలు చేసినట్లు విశ్వాసనీయ సమాచారం అన్నారు. లెక్కలేనంతగా పెరిగిన మెగా కృష్ణారెడ్డి ఆస్తులపై పలుమార్లు ఐటి ఈడి దాడులు నిర్వహించబడినయని అయినప్పటికీ తన పలుకుబడి ముందు అవేవీ నిలబడకపోవడం మరింత ఆశ్చర్యం అన్నారు. పారిశ్రామిక రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలోనే కాకుండా మీడియా రంగాన్ని కూడా శాసించే స్థాయికి ఎదిగిపోవడం కృష్ణారెడ్డి పలుకుబడికి నిదర్శనంగా మారిపోయిందన్నారు. ఆస్తుల సంపాదనలో అంతులేని రారాజుగా ఎదిగిన మెగా కృష్ణారెడ్డి సేవా రంగాన్ని మాత్రం నిర్లక్ష్యం చేసినట్లుగా కనిపిస్తుందన్నారు. తన మామ పిపి రెడ్డి వాటాను కొనుగోలు చేసేందుకు గ్లోబల్ ఫండ్స్ నుండి 7వేల కోట్ల మిలియన్ డాలర్లను సమీకరించి సంస్థ నిర్మాణంలోనే కాకుండా సంస్థ యాజమాన్యంలో కీలకనాంది పలికినట్లుగా తెలుస్తుందన్నారు. సంస్థ ఏర్పాటు చేయబడినది మొదలుకొని ఇప్పటివరకు ఆయా ప్రభుత్వాల ద్వారా పొందుకున్న కాంట్రాక్టు లావాదేవీలను, సంస్థ ద్వారా నిర్వహించబడిన బడా కాంట్రాక్టు పనులను పూర్తిస్థాయిలో పరిశీలిస్తూ ఆస్తుల సంపాదనపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వివిధ పార్టీల రాజకీయ నాయకుల ఆస్తులపై విచారణ జరుగుతుండగా ప్రభుత్వ అధికారుల ఆస్తులపై విచారణ జరుగుతుండగా వ్యాపారస్తులు తెలంగాణ ప్రజల సొమ్మును ప్రభుత్వ కాంట్రాక్టు పద్ధతుల రూపంలో వేలకోట్లు సంపాదించి లక్షల కోట్లకు ఆస్తిపరులు అవుతుండగా వాళ్లకు మాత్రం విచారణ మినహాయింపు ఎందుకు జరుగుతుందంటూ సూటిగా నిలదీశారు. 12 సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర పాలనలో ఎలాంటి కాంట్రాక్టర్నైనా సునాయాసంగా రాబట్టుకునే సంపన్నమైన పారిశ్రామిక వేత్తలు వ్యాపార రంగాలను శాసిస్తున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి 12 సంవత్సరాలుగా కాంట్రాక్టులు పొందుకుంటున్న వ్యాపారంగ సంస్థలపై వాళ్ళ ఆస్తుల వివరాలపై కాంట్రాక్టుల పద్ధతులపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరగాలని వాటి ద్వారా తెలంగాణ పేద ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ నిధులను మధ్యస్థంగా మళ్ళించుకుంటూ కాంట్రాక్టు టెండర్ల ద్వారా విపరీతమైన అవినీతికి పాల్పడుతున్న వ్యాపారవేత్తలపై విచారణ జరిపించినట్లయితే రాజకీయ పెద్దల బండారం కూడా బయటపడే ఆస్కారం ఉందని తెలియజేస్తూ రాజకీయ పాలకులు వ్యాపారవేత్తలు కలిసి తెలంగాణ ప్రజల సొమ్మును వ్యాపార రూపంలో ఆస్తులు సంపాదించుకుంటున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా మెగా ఆస్తుల వివరాలను మెగా కృష్ణారెడ్డి వ్యాపారానికి సంబంధించిన సంస్థ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో వివరించాలన్నారు .

రూ.లక్ష కోట్ల విలువ వెనుక అసలు లెక్కలేంటి?

మేఘా ఇంజనీరింగ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులు..

ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులపై పారదర్శకత ఎక్కడ?

రూ.6,540 కోట్ల నిధుల సమీకరణ.. ఐపీవో ప్రణాళికలపై ఆసక్తికర చర్చ

తెలంగాణ రాజధాని కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూప్ విలువ రూ.లక్ష కోట్లుగా అంచనా వేయడం ఇప్పుడు పారిశ్రామిక, ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి సుమారు రూ.6,540 కోట్ల నిధుల సమీకరణ, మరోవైపు భవిష్యత్తులో ఐపీవోకు సిద్ధమవుతున్నట్లు వస్తున్న వార్తలు సంస్థ ఆర్థిక ప్రయాణంపై ఆసక్తిని పెంచుతున్నాయి. 1989లో చిన్న సంస్థగా ప్రారంభమైన మేఘా ఇంజనీరింగ్ నేడు దేశవ్యాప్తంగా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టే స్థాయికి ఎదిగింది. ముంబై కోస్టల్ రోడ్, జోజిలా టన్నెల్, థానే--బోరివలి ట్విన్ టన్నెల్, కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి వంటి భారీ ప్రాజెక్టుల్లో సంస్థ భాగస్వామిగా ఉంది. అయితే ఇంతటి భారీ ప్రాజెక్టుల నేపథ్యంలో సంస్థ ఆర్థిక లావాదేవీలు, ప్రాజెక్టుల వ్యయాలు, ఒప్పందాల వివరాలు, ప్రజాధన వినియోగంపై పూర్తి పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.లక్ష కోట్ల విలువ.. ఎవరి అంచనా?

అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలైన డేవిడ్‌సన్ కెంప్నర్, హిల్‌హౌస్ క్యాపిటల్, వర్డే పార్ట్‌నర్స్ నుంచి 700 మిలియన్ డాలర్లు (సుమారు రూ.6,540 కోట్లు) సమీకరించినట్లు సమాచారం. ఈ లావాదేవీలో భాగంగా మేఘా గ్రూప్ విలువను రూ.లక్ష కోట్లుగా అంచనా వేసినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే కంపెనీ విలువ అంచనా వేయడం, అంతే మొత్తంలో నగదు లేదా ఆస్తులు సంస్థ వద్ద ఉండటం రెండూ ఒకటి కావు. ఈ విలువను ఏ ప్రాతిపదికన నిర్ణయించారు? సంస్థ అప్పులు, ఆస్తులు, ఆదాయాలు, భవిష్యత్తు ఆదాయ అంచనాల వివరాలు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత అవసరం.

కుటుంబ వాటాల బదిలీ.. పెట్టుబడుల వెనుక వ్యూహం ఏమిటి?

ప్రమోటర్లలో పీవీ కృష్ణారెడ్డికి 57 శాతం, పి.పిచ్చిరెడ్డికి 43 శాతం వాటాలు ఉన్నట్లు సమాచారం. కుటుంబ ఒప్పందంలో భాగంగా పిచ్చిరెడ్డి వాటాను కృష్ణారెడ్డి కొనుగోలు చేయనున్నారనే వార్తలు గతంలో వెలువడ్డాయి. తాజాగా సమీకరించిన నిధుల్లో ఈ వాటాల కొనుగోలుకు ఎంత మొత్తం వినియోగిస్తారు? పెట్టుబడిదారులకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ఐపీవోకు సిద్ధం.. పెట్టుబడిదారులకు లాభాలే లక్ష్యమా?

మేఘా ఇంజనీరింగ్‌ను వచ్చే మూడేళ్లలో, అనుబంధ సంస్థ ఈపీటీఎల్‌ను వచ్చే 12 నెలల్లో పబ్లిక్ ఇష్యూకు తీసుకురావాలనే ప్రణాళికలు ఉన్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు పెట్టిన పెట్టుబడులు భవిష్యత్తులో ఎలా రాబట్టుకుంటారు? సాధారణ మదుపరులకు కంపెనీ ఆర్థిక పరిస్థితిపై పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందా? అనే ప్రశ్నలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ప్రజాధనంతో ప్రాజెక్టులు.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి!

ప్రభుత్వాల నుంచి భారీ కాంట్రాక్టులు పొందే మౌలిక సదుపాయాల సంస్థల విషయంలో ప్రజాధన వినియోగం, టెండర్ల ప్రక్రియ, ప్రాజెక్టుల నాణ్యత, గడువులు, వ్యయాల పెరుగుదల వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండాలి. మేఘా ఇంజనీరింగ్ ఎదుగుదల ఒక పారిశ్రామిక విజయగాథగా ప్రచారం పొందుతున్నప్పటికీ, దాని వెనుక ఉన్న ఆర్థిక లెక్కలు, ప్రభుత్వ ప్రాజెక్టుల ఒప్పందాలు, పెట్టుబడుల ప్రయోజనాలు కూడా సమానంగా చర్చకు రావాలి. కంపెనీ విలువ ఎంత పెరిగిందన్నది మాత్రమే కాదు.. ప్రజాధనంతో చేపట్టిన ప్రాజెక్టుల్లో ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూరిందన్నదే అసలైన ప్రశ్న!.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు.. అరెస్ట్ చేసే అవకాశం

నిర్మల్, నవంబర్ 20 జై భీమ్ క్రైమ్ న్యూస్) :

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ ఉదయం ఖానాపూర్‌తో పాటు హైదరాబాద్‌లోని ఆమె నివాసాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో ముమ్మర సోదాలు చేపట్టారు. ఖానాపూర్ మండలం సత్తెనపల్లి వద్ద రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం ధాన్యాన్ని కేటాయించింది. అయితే, 2022-23, 2023-24, 2024-25 రబీ సీజన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో పెద్ద మొత్తంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ గుర్తించింది. గత ఆగస్టు నెలలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలింది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఫిర్యాదు చేయడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు తాజాగా రంగంలోకి దిగి సోదాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఖానాపూర్‌లోని రేఖానాయక్ నివాసం వద్ద విజిలెన్స్, స్థానిక పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. నివాసాల్లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు, విచారణ అనంతరం ఆమెను అదుపులోకి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

చిన్నారి సిరికి ఆశీస్సులు

నూతన వస్త్రాలంకరణ వేడుకలో సందడి
చిన్నారిని ఆశీర్వదించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు
హాజరైన ముద్రబోయిన వెంకటేశ్వర్లు తదితరులు
తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు
ఆనందోత్సాహాల మధ్య వేడుక నిర్వహణ



రాయపర్తి (జై భీమ్ న్యూస్):

మండలంలోని తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన వశపాక స్వరూప, వశపాక నరసయ్య దంపతుల ఏకైక కుమార్తె చిరంజీవి సిరి నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ వేడుకను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడి రామచంద్రారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వశపాక ఎల్లయ్య, యూత్ అధ్యక్షులు భాషబోయిన నాగరాజు, బొజ్జ శ్రీనివాస్, బరిగెల కుమార్ (6వ మెంబర్), చిదురాల నర్సయ్య, ప్రవీణ్, కొమురయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారి చిరంజీవి సిరిని నాయకులు, పెద్దలు ఆప్యాయంగా ఆశీర్వదించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చిన్నారి తల్లిదండ్రులు వశపాక స్వరూప, వశపాక నరసయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ నాయకులు, పెద్దలు, కుటుంబ సభ్యులు ఒకేచోట చేరి చిన్నారిని ఆశీర్వదించడంతో వేడుక ఆత్మీయత, ఆనందాల మధ్య కొనసాగింది.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి



జిల్లా కలెక్టర్ సత్య శారద

వరంగల్, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

బాలల హక్కుల పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం, బాలల వారోత్సవాల ముగింపు వేడుకలను శుక్రవారం ఆటోనగర్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించిన బాలల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి పరిశీలన గృహం సూపరింటెండెంట్ శ్రీదేవి అధ్యక్షత వహించగా, జిల్లా కలెక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెద్దల మాదిరిగానే బాలలకు కూడా ప్రత్యేక హక్కులు ఉన్నాయని తెలిపారు. జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కు, రక్షణ పొందే హక్కులను రాజ్యాంగం, చట్టాలు కల్పించాయని, వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, తగిన రక్షణ కల్పించడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఉన్న బాలలను ఉద్దేశించి మాట్లాడుతూ, తెలిసీ తెలియని వయసులో చేసిన తప్పులను గుర్తించి వాటిని సరిదిద్దుకొని మంచి మార్గంలో పయనించాలని సూచించారు. గతంలో జరిగిన తప్పులు భవిష్యత్తును నిర్ణయించవని, కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. దొంగగా జీవించిన రత్నాకరుడు తన జీవితాన్ని మార్చుకొని మహర్షి వాల్మీకి మారి రామాయణాన్ని రచించిన విషయాన్ని ఉదహరిస్తూ బాలల్లో స్ఫూర్తి నింపారు. కోరికలను జయించి, చెడు ఆలోచనలకు దూరంగా ఉంటూ మంచి లక్ష్యాలను ఏర్పరచుకోవాలని బుద్ధుని బోధనలను గుర్తుచేశారు. జిల్లా సంక్షేమ అధికారిణి రాజమణి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులని, బాలల భవిష్యత్తుతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. బాలల హక్కులు, సంక్షేమం, విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వారి సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు మాట్లాడుతూ, గతాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదని, అయితే భవిష్యత్తును తమకు అనుకూలంగా మలుచుకునే శక్తి బాలలకు ఉందని తెలిపారు. తమ భవిష్యత్తును మంచి మార్గంలో తీర్చిదిద్దుకోవాలని సూచించారు. బాలల వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం, వివిధ బాలల సంరక్షణ సంస్థల్లోని బాలలకు వ్యాసరచన, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలలకు జిల్లా కలెక్టర్ సత్య శారద బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి బత్తిని కళ్యాణి, బాలల సంక్షేమ సమితి సభ్యురాలు షాహిదా బేగం, డీసీపీయూ సిబ్బంది రాజుల సుమన్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది సుష్మ, ఏహెచ్‌టీయూ పీసీ రామారావు, షేర్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది జన్ను ప్రభాకర్, ప్రశాంతి, కల్పన, పరిశీలన గృహం సిబ్బంది, బాలలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నమూనా రూపకల్పనపై కాకతీయ విశ్వవిద్యాలయం కె-హబ్‌లో ప్రత్యేక శిక్షణ

స్టార్టప్‌ల విజయానికి వ్యాపార నమూనా రూపకల్పన కీలకం - డాక్టర్ కృష్ణ కిశోర్

హన్మకొండ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయం కె-హబ్, హైదరాబాద్ టీ-హబ్ సహకారంతో తొమ్మిదవ విద్యార్థి అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌డీపీ)లో భాగంగా 'వ్యాపార నమూనా క్యాన్వాస్' పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన సెరెవిన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి డాక్టర్ కృష్ణ కిశోర్ మార్గదర్శకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ కిశోర్ స్టార్టప్ ప్రారంభ దశలైన సమస్య గుర్తింపు, ఆలోచన రూపకల్పన, ఆలోచన సాధ్యాసాధ్యాల పరిశీలన, నమూనా తయారీ నుంచి విస్తరించగల వ్యాపార సంస్థ నిర్మాణం వరకు వివరించారు. వ్యాపార నమూనా ద్వారా



వినియోగదారులకు విలువను సృష్టించడం, అందించడం, ఆదాయాన్ని పొందడం వంటి అంశాలను ఉదాహరణలతో వివరించారు. వ్యాపార నమూనా క్యాన్వాస్‌లోని తొమ్మిది ప్రధాన అంశాలను పరిచయం చేస్తూ వినియోగదారుల విభాగాలు, విలువ ప్రతిపాదన, పంపిణీ మార్గాలు, వినియోగదారులతో సంబంధాలు, ఆదాయ మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గూగుల్ శోధన, వాట్సాప్, జెరోధా, స్విగ్గీ, ఐఆర్‌సీటీసీ, ఫిజిక్స్ వాలా వంటి సంస్థల ఆదాయ నమూనాలను విద్యార్థులతో విశ్లేషించారు. అలాగే వ్యాపార నమూనాల



రూపకల్పనలో సాధారణంగా జరిగే పొరపాట్లను వివరించి, ఓయో, జొమాటో సంస్థల అభివృద్ధి తీరును ఉదాహరణలతో తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రాయోగిక కార్యకలాపం నిర్వహించి, తమ స్టార్టప్ ఆలోచనలకు అనుగుణంగా వ్యాపార నమూనా క్యాన్వాస్ రూపొందించేలా మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రూసా 2.0 నోడల్ అధికారి ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్ రెడ్డి, కె-హబ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిత జ్యోత్స్న, సమన్వయకర్త ఎ. సిద్ధార్థ, టీ-హబ్ ప్రతినిధి డి. వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

22న హనుమకొండ జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం

84,654 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు



హన్మకొండ, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లాలో ఈ నెల 22వ తేదీ ఆదివారం నిర్వహించనున్న సబ్ నేషనల్ ఇమ్యూనైజేషన్ డే (పల్స్ పోలియో) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు కోరారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన పోలియో వ్యాక్సిన్, పోస్టర్లు, బ్యానర్లు, స్టేషనరీ తదితర సామగ్రిని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పోలియో నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 22న హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హనుమకొండ జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. బూత్‌లకు రాని, పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించేందుకు నవంబర్ 23, 24 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు 84,654 మంది ఉన్నట్లు అంచనా వేయగా, వీరందరికీ పోలియో చుక్కలు అందించేందుకు జిల్లావ్యాప్తంగా 496 పల్స్ పోలియో బూత్‌లు, 12 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్, ఒక పిపిపి యూనిట్ ద్వారా నిర్వహించనున్నట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు తెలిపారు.

ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు కాకతీయ విశ్వవిద్యాలయంలో గ్రాండ్ టెస్ట్

ఈ నెల 21న ఉదయం 10 గంటలకు నిర్వహణ





హన్మకొండ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యయన కేంద్రం, హనుమకొండ సమీక్ష ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈ నెల 21వ తేదీ శనివారం గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అధ్యయన కేంద్రం సంయుక్త సంచాలకులు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటలకు కాకతీయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ భవనంలోని కౌన్సెలింగ్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులందరూ గ్రాండ్ టెస్ట్‌కు తప్పనిసరిగా హాజరై తమ పరీక్షా సన్నద్ధతను, ప్రతిభను అంచనా వేసుకోవాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అవసరమైన పరీక్ష ప్యాడ్లను (ఎగ్జామ్ ప్యాడ్స్) వెంట తీసుకురావాలని డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem
సామాన్యుడి ఆయుధంగా

నేటి బాలలే రేపటి పౌరులు..

ఆనందకరమైన బాల్యంతోనే ఉత్తమ సమాజ నిర్మాణం





బాలల హక్కుల వారోత్సవాల ముగింపు, ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా

వరంగల్, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లలకు ఆనందకరమైన బాల్యాన్ని అందించినప్పుడే రేపటి ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కృష్ణవేణి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశపు హాల్లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం, ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారిణి ఇ.పి. ప్రేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ జాయింట్ డైరెక్టర్ కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల ఒడంబడిక ప్రకారం పిల్లలకు అనేక హక్కులు కల్పించబడ్డాయని, వాటిని సంరక్షించే బాధ్యత ప్రభుత్వం, తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు. బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను బాలల సంరక్షణ చట్టాలపై ప్రశ్నించి అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహనతో పాటు సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 181, 100 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గోపాలరావు మాట్లాడుతూ బాలలకు పౌష్టికాహారం తీసుకునే హక్కుతో పాటు మంచి వాతావరణంలో పెరిగే హక్కు ఉందన్నారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా బాలల అభివృద్ధికి ఎంతో అవసరమని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాలల సంక్షేమ సమితి ములుగు చైర్‌పర్సన్ కే. వసుధ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాలలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, యుక్తవయస్సులో వచ్చే మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనిస్తూ పిల్లలను సరైన మార్గంలో నడిపించాలని అన్నారు. తెలిసీ తెలియని వయస్సులో జరిగే పొరపాట్లను సరిదిద్దుకొని మంచి జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారిణి ఇ.పి. ప్రేమలత మాట్లాడుతూ బాల్యంలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో వాటిని సాధించినవారు, మంచి నడవడిక కలిగినవారు సమాజంలో ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని అన్నారు. భారత ప్రభుత్వం 1992లో అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడికపై సంతకం చేసి బాలల హక్కుల పరిరక్షణకు బాధ్యత తీసుకుందని తెలిపారు. ఐక్యరాజ్యసమితి నవంబర్ 20వ తేదీని అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవంగా గుర్తించడంతో ఈ రోజున బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్యాలు, పాటలతో అలరించారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మాట్లాడే బొమ్మ ద్వారా జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ పిల్లలకు సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుడు సుభాష్, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్ కుమార్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రజిత, బాలబాలికల ప్రతినిధులు కృష్ణ ప్రసాద్, హర్షిత, జిల్లాలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖి, మహిళా సాధికారత కేంద్రం, కోనేరు సంస్థ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవ ఏర్పాట్లపై వైస్ ఛాన్సలర్ సమీక్ష





హన్మకొండ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

నవంబర్ 28న నిర్వహించనున్న స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి. కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవాన్ని నవంబర్ 28వ తేదీ శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో, వైస్ ఛాన్సలర్ ఆడిటోరియంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై వైస్ ఛాన్సలర్ సమీక్ష నిర్వహించారు. స్నాతకోత్సవానికి హాజరయ్యే అతిథులు, బంగారు పతక గ్రహీతలు, డాక్టరేట్ పట్టభద్రులు, ఇతర ఆహ్వానితులకు అవసరమైన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్నాతకోత్సవంలో భాగంగా నిర్వహించే సంప్రదాయ వేడుకలు (సెరిమోనియల్ ఆరెంజ్మెంట్స్) సజావుగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వైస్ ఛాన్సలర్ స్పష్టం చేశారు. గత స్నాతకోత్సవాల్లో చేపట్టిన ఏర్పాట్లను ప్రస్తుత ఏర్పాట్లతో పోల్చి పరిశీలించి, అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని సూచించారు. రెండు మూడు రోజుల అనంతరం మరోసారి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆచార్య పి. మల్లారెడ్డి, ఆచార్య టి. మనోహర్, ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఆచార్య రాజేందర్ కట్ల, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, ఆచార్య వై. వెంకయ్య, ఆచార్య ఎన్. ప్రసాద్, డాక్టర్ టి. శాస్త్రి, డాక్టర్ డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి.. అంకితభావంతో విధులు నిర్వహించాలి: వరంగల్ సీపీ



వరంగల్, నవంబర్ 20 జై భీమ్ క్రైమ్ న్యూస్)

అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా (ఏఎస్ఐలు) విధులు నిర్వహిస్తూ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా (ఎస్ఐలు) పదోన్నతి పొందిన అధికారులు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందిన వారిలో టి. కమల, ఎం. రాజేందర్, ఏ. సగాయమ్మ, వై. కాసులు, కె. పద్మ, ఎన్. లక్ష్మి, కె. సంతోష, సి. హెచ్. పద్మ ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నూతనంగా పదోన్నతి పొందిన ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలియజేశారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయ బోధనేతర సిబ్బందికి టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు



వరంగల్, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈరోజు టీఎన్జీవోస్ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గాజె వేణుగోపాల్, కార్యదర్శి పాలకుర్తి సదానందం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి సంఘ సభ్యత్వాలను నమోదు చేశారు. జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న మొత్తం 45 మంది బోధనేతర సిబ్బందికి 2026--2027 సంవత్సరానికి సంబంధించి టీఎన్జీవోస్ సంఘ సభ్యత్వ నమోదు రసీదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ట్రెజరర్ కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రామానుజం, జగదీశ్వర్, జిల్లా బాధ్యులు మానస, చిరంజీవి, చందు, జిల్లా విద్యాశాఖ ఫోరం బాధ్యులు శ్రీమతి గాయత్రి దేవి, బాబ్జి, శ్రీనివాస్, రాహుల్, సాయి, ఉదయ్, సతీష్, వెంకటేశ్వర్లు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలి

కేయూ రెండో గేటు ఎదుట కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల మానవహారం



హన్మకొండ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తక్షణమే యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మానవహారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేయూ రెండో గేటు ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ చైర్మన్ డా. పి. కరుణాకర్ రావు, కన్వీనర్ డా. సాదు రాజేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల పట్ల వివక్ష చూపుతోందని ఆరోపించారు. దీర్ఘకాలంగా విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న తమ సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. రెగ్యులర్ నియామకాల కంటే ముందుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తక్షణమే యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డా. రంగారెడ్డి, డా. చంద్రశేఖర్, డా. సూర్యనారాయణ, డా. రఘువర్ధన్ రెడ్డి, డా. సత్యనారాయణ, డా. మామిడి లింగయ్య, డా. సాంబశివరావు, డా. సంగీత్, డా. నర్సింహులు, డా. రాధిక, డా. కవిత తదితరులు పాల్గొన్నారు.

నూతన మేయర్ ముక్కా శ్రావణి తండ్రి మృతి

విశాఖ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

నగర నూతన మేయర్ ముక్కా శ్రావణి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆమె తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆకస్మిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. కుమార్తె మేయర్ గా ప్రమాణ స్వీకారం చూడకుండానే తండ్రి మృతిపై సర్వత్ర దిగ్భ్రాంతి వ్యక్తమయింది. ముత్యాలనాయుడు మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు టీడీపీ నేతలు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసిన ముక్కా శ్రావణి 2,44,644 ఓట్ల భారీ మెజారిటీతో మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. మొత్తం 120 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 98 వార్డుల్లో విజయం సాధించారు.

చిత్తడి నేలల గుర్తింపు, సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి



హన్మకొండ, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లాలో చిత్తడి నేలల (వెట్ ల్యాండ్స్) గుర్తింపు, వాటి సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. రవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఈ అంశంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, సర్వే, అటవీ, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని చిత్తడి నేలలను గుర్తించి, వాటి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించడంతో పాటు సంబంధిత పూర్తి సమాచారాన్ని సేకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చిత్తడి నేలలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. చిత్తడి నేలల గుర్తింపు, సరిహద్దుల నిర్ధారణలో రెవెన్యూ, అటవీ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మూడు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టి, నిర్దేశిత గడువులోగా సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు.ం

తీరం దాటిన 'అక్వాన్' తుపాను..

ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

- తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు. తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకభద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని

గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి కేంద్రాలు





హన్మకొండ, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

ప్రాచీన కాలం నుంచి ఆధునిక డిజిటల్ యుగం వరకు గ్రంథాలయాలు విజ్ఞాన పరిరక్షణ, విద్యాభివృద్ధి, సమాచార వ్యాప్తికి కీలక కేంద్రాలుగా నిలుస్తున్నాయని కాకతీయ విశ్వవిద్యాలయ ఓఎస్డీ ప్రొఫెసర్ బి. వెంకట్రామ్ రెడ్డి అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాల ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని, విజ్ఞానాన్ని భావితరాలకు అందించడంలో వాటి పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బి. వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాచీన కాలంలో గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా సేవలందించాయని, నేడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని విస్తృత సమాచారాన్ని అందించే కేంద్రాలుగా రూపాంతరం చెందాయని వివరించారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం, పరిశోధకులకు అవసరమైన సమాచారాన్ని అందించడం, జ్ఞానాన్ని విస్తరించడం వంటి అంశాల్లో గ్రంథాలయాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు, డిజిటల్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని తమ జ్ఞానాన్ని, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ పరిశోధనా కేంద్రం వ్యవస్థాపకులు, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జి. రామేశ్వరం గౌరవ అతిథిగా హాజరై సందేశాన్ని అందించారు. డాక్టర్ బి. రాధికారాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, టి. జావర్ స్వాగతం పలికారు. వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, పోటీల వివరాలతో కూడిన నివేదికను బి. సుమలత సమర్పించారు. అనంతరం వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ బి. వెంకట్రామ్ రెడ్డి, గౌరవ అతిథి ప్రొఫెసర్ జి. రామేశ్వరంలను ఘనంగా సత్కరించారు. చివరగా అశోక కృతజ్ఞతలు తెలియజేయగా, జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

పుస్తక పఠనమే విజ్ఞానానికి పునాది!





గ్రంథాలయాల సందర్శనతో విద్యార్థుల్లో మేధాశక్తి, వ్యక్తిత్వ వికాసం
చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి
కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుందని, మంచి ఆలోచనా విధానంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. పుస్తకాలు మనిషికి ఎప్పటికీ మంచి స్నేహితులని, విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.జిల్లా గ్రంథాలయ సంస్థ, వరంగల్, జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం, బహుమతుల ప్రదానోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పుస్తక పఠనంతోనే మేధో వికాసం

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులకు పుస్తకాలే మంచి నేస్తాలుగా మారాలని, పుస్తక పఠనం ద్వారా మేధాశక్తి పెంపొందడంతో పాటు సమాజంపై అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞానాన్ని అందించే ఇతర పుస్తకాలను కూడా చదవాలని సూచించారు.

గ్రంథాలయాల వినియోగంపై అవగాహన కల్పించాలి

గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న విలువైన పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని, విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రంథాలయాలకు పాఠకుల సంఖ్య పెరిగేలా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి ప్రేమలత, ఎంఈఓ వెంకటేశ్వరరావు, వ్యాఖ్యాత, ఉపాధ్యాయుడు ఠయ్యాల శ్రీధరాచార్యులు, గ్రంథపాలకులు అమీనా, చిన్నబాబు, రామచంద్రం, ప్రత్యూష, అశోక్, లక్ష్మీనారాయణ, రాంబాబు, రాజమౌళి, సిబ్బంది అరుణ, లలిత, రజిత, లక్ష్మి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంచెర్లలో నేడు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవం

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

ములుగు, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

ములుగు జిల్లా ఇంచెర్ల గ్రామంలోని రైతువేదికలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు వివరించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ఉపాధి పొందే కుటుంబ సభ్యులకు సంబంధించిన నిబంధనల ప్రకారం ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. పథకానికి సంబంధించిన వివరాలు, అర్హతలు, నమోదు ప్రక్రియపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అర్హులైన కుటుంబాలు ప్రభుత్వ మార్గదర్శకాలను తెలుసుకుని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఇంచెర్ల రైతువేదికలో నిర్వహించనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



ఖేలో ఇండియా నేషనల్ యూత్ గేమ్స్- 2026 లోగో, మస్కట్ ఆవిష్కరణ

జిల్లాలో జాతీయ యువజన క్రీడలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా నేషనల్ యూత్ గేమ్స్--2026 లోగో, మస్కట్ గోడపత్రికలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్ పట్టణాల్లో జాతీయ యువజన క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నిర్వహించనున్న ఈ ప్రతిష్టాత్మక జాతీయ క్రీడలపై జిల్లాలోని యువత, క్రీడాకారులకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రీడలకు సంబంధించిన లోగో, మస్కట్‌లను జిల్లాలోని క్రీడా ప్రాంగణాలు, బస్‌స్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద కటౌట్లు, బ్యానర్లు, పోస్టర్ల రూపంలో ఏర్పాటు చేసి ప్రజలకు, యువతకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జాతీయ యువజన క్రీడల విజయవంతానికి సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ అదనపు కలెక్టర్ అనిల్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద ముప్పునకు చెక్.. నాలాల అభివృద్ధికి కార్యాచరణ!

వడ్డేపల్లి, బొంది వాగు, చిన్న వడ్డేపల్లి నాలాల పటిష్టీకరణకు ప్రణాళిక
స్ట్రామ్ వాటర్ డ్రైన్ డీపీఆర్‌పై సమీక్షించిన సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి





జీడబ్ల్యూఎంసీ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

వరంగల్ నగరాన్ని వర్షాకాలంలో ముంపు సమస్య నుంచి శాశ్వతంగా గట్టెక్కించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు రహదారులు, కాలనీల్లోకి చేరకుండా నాలాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, పటిష్టమైన స్ట్రామ్ వాటర్ డ్రైన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నగరంలో ప్రతిపాదించిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) పురోగతిపై రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ప్రధాన నాలాల సామర్థ్యం పెంపుపై దృష్టి

నగరంలోని వడ్డేపల్లి నాలా, బొంది వాగు నాలా, చిన్న వడ్డేపల్లి నాలాలను పటిష్టంగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా సీడీఎంఏ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసినా వరద నీరు నిలిచిపోకుండా, ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా ప్రవహించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, నాలాల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించి వాటి సామర్థ్యాన్ని పెంచేలా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

డీపీఆర్‌లో సమగ్ర ప్రతిపాదనలు

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి బల్దియా ప్రత్యేకాధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న పాల్గొన్నారు. నగరంలోని ప్రధాన నాలాల ప్రస్తుత పరిస్థితి, తరచూ ముంపునకు గురయ్యే ప్రాంతాలు, వరద నీటి మళ్లింపునకు చేపట్టాల్సిన చర్యలను వారు సీడీఎంఏకు వివరించారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్ డీపీఆర్‌లో అవసరమైన ప్రతిపాదనలను పొందుపరిచినట్లు వెల్లడించారు. నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ సమీక్షలో స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

బాలలే భవిష్యత్తు భారతానికి వరం: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





హన్మకొండ, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

నేటి బాలలే భవిష్యత్తు భారతానికి వరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, భద్రత, అభివృద్ధిపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 14 నుంచి 20 వరకు దశలవారీగా బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాలు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం శిశువు పుట్టుకకు ముందునుంచే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిషేధించిందని, బాలలతో ఎవరైనా బలవంతంగా వెట్టి పనులు చేయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలలకు విద్యను అభ్యసించే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ప్రతి బాలుడు, బాలిక చదువుకోవాలని సూచించారు. పేదరికంలో పుట్టి ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి మిస్సైల్ శాస్త్రవేత్తగా ఎదిగి అనంతరం రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం బాలలకు ఆదర్శమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి మాట్లాడుతూ బాలలను, వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం భారతదేశంలో బాలలు, యువత అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. బాలికలు క్రమశిక్షణతో ఎదగాలని, స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకోవాలని సూచించారు. స్ఫూర్తివంతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ బాలల దినోత్సవం నుంచి వారం రోజులపాటు నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా బాలసదనం, కరుణాలయం, రీచ్ బాలల సంరక్షణ కేంద్రాల పిల్లలు 'వద్దే వద్దమ్మ నాకు బాల్య వివాహం', 'బడి ఈడులోనే బండెడంత బాధ్యత భారం', 'బుడిబుడి అడుగులేస్తాం.. తారాలనే తాకేస్తాం', 'పారే గోదారి గలగల నవ్వే నా దారి' వంటి పాటలకు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పిల్లల ప్రతిభను చూసి కలెక్టర్ అభినందించారు. బాలల దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా ప్రత్యేక దత్తత విభాగం శిశు గృహ చిన్నారులు నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల ప్రదర్శనను కలెక్టర్ అభినందించి బహుమతులు అందజేశారు. అనంతరం కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి సంరక్షకుల వద్ద ఆశ్రయం పొందుతున్న నగరానికి చెందిన సుమైయా ఆనం అనే బాలికకు పీఎం కేర్ పథకం కింద రూ.10 లక్షల మొత్తానికి సంబంధించిన పాస్‌బుక్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ మొత్తాన్ని బాలిక భవిష్యత్తుకు ఉపయోగించుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు, సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, బాలల న్యాయ మండలి సభ్యురాలు డాక్టర్ కె. గోపికా రాణి, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె. అనితా రెడ్డి, బాలరక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్ అవంతి, సీడీపీవోలు బి. స్వరూప, కె. స్వాతి, ఇన్‌చార్జి డీసీపీవో ఎస్. ప్రవీణ్ కుమార్, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖి, డీహెచ్‌ఈడబ్ల్యూ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీసులు, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా ఆరోగ్య విభాగానికి నూతన ఏఎంహెచ్ఓ

కమల్ చంద్ నాయక్‌కు బాధ్యతలు..
పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచన




జీడబ్ల్యూఎంసీ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (ఏఎంహెచ్ఓ)గా నూతనంగా నియమితులైన కమల్ చంద్ నాయక్ శుక్రవారం బల్దియా కమిషనర్ టి. వెంకన్నను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమల్ చంద్ నాయక్‌కు కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు.

వరంగల్‌లో 512 ఇందిరమ్మ గృహాల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం

రూ.8.50 లక్షల ఫ్లాట్.. రూ.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీ - డిసెంబర్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

వరంగల్, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)


తెలంగాణ ప్రభుత్వము
తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ
పత్రికా ప్రకటన

• దరఖాస్తులకు చివరి తేదీ: 05-12-2026.
• ఫ్లింత్ ఏరియా: 512 చదరపు అడుగులు.

Assistant Estate Officer
Telangana Housing Board
Warangal Division, Warangal.

తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో అర్హులైన కుటుంబాలకు గృహాలు కేటాయించేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. వరంగల్ జిల్లాలోని క్రీస్తునగర్ హౌసింగ్ బోర్డు కాలనీ, గిరికంట్ల గ్రామం, గుగ్గిలం మండలం పరిధిలో నిర్మించిన జీ+5 అంతస్తుల గృహ సముదాయంలో మొత్తం 512 ఫ్లాట్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించనున్నట్లు పత్రికా ప్రకటనలో వెల్లడించింది. ఈ గృహాల కేటాయింపునకు అర్హులైన వారు 2026 డిసెంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఒక్కో ఫ్లాట్ ధర రూ.8.50 లక్షలుగా నిర్ణయించగా, లబ్ధిదారుని వాటా రూ.3.50 లక్షలు, ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ.5 లక్షలుగా పేర్కొన్నారు. గృహాల నిర్మాణం పూర్తయినట్లు ప్రకటనలో వెల్లడించారు. గృహం పొందేందుకు దరఖాస్తుదారులకు ఎక్కడా సొంత ఇల్లు లేదా స్థలం ఉండకూడదని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల వరకు ఉండాలని నిబంధనలు విధించారు. అలాగే కేటాయించిన ఫ్లాట్‌ను పదేళ్ల వరకు విక్రయించడం లేదా అద్దెకు ఇవ్వడం నిషేధమని, బ్యాంకు తనఖాకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఒక కుటుంబానికి ఒకే గృహం, ఒకే స్థలం అనే నిబంధన వర్తిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సంబంధిత పత్రాలను సమర్పించాలని సూచించారు. అర్హులైన దరఖాస్తుదారులను గుర్తించేందుకు 360 డిగ్రీల సమగ్ర పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు లాటరీ విధానం ద్వారా గృహాలను కేటాయించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ అధికారులు సూచించారు.

ఎన్ఐటీ వరంగల్-కిట్స్ మధ్య ఎంఓయూ పునరుద్ధరణ

వరంగల్, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)



విద్యా, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఎన్ఐటీ వరంగల్, కిట్స్ వరంగల్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) నవంబర్ 19న పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి పరిశోధనలు, సదస్సులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఈ ఒప్పందం ద్వారా కిట్స్ అధ్యాపకులు, విద్యార్థులు రూ.88.71 లక్షల పరిశోధన నిధులు సాధించారని, ప్రతిష్టాత్మక జర్నల్స్‌లో 23 ఉమ్మడి పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎం. వీరారెడ్డి, ప్రొఫెసర్ ఎస్. నరసింహారెడ్డి, డాక్టర్ జి. సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఎంఓయూ పునరుద్ధరణపై కిట్స్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి, అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్ ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లు ఆత్మగౌరవానికి ప్రతీక: వొడితల ప్రణవ్





జమ్మికుంట, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలని, సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధితో పాటు ఇల్లందకుంట మండల కేంద్రం, లక్ష్మాజిపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు, నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసే కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటిని నిర్మించుకోవాలని కలలు కంటున్న పేద కుటుంబాల ఆశలను ప్రభుత్వం నెరవేరుస్తోందని ప్రణవ్ పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవాన్ని, భద్రతను కల్పిస్తుందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించి వారి కలలను నిజం చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పేదలు సొంత ఇళ్లను నిర్మించుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇంటిని నిర్మించుకోవాలనే కోరిక ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం, వొడితల ప్రణవ్ సహకారంతో తమ కల నెరవేరిందని వారు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమాల్లో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, సర్పంచులు, జమ్మికుంట పట్టణ నాయకులు, ఇల్లందకుంట మండల నాయకులు, మహిళా నాయకురాళ్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హన్మకొండ, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఘన స్వాగతం పలికారు. ఐనవోలు మండలం పున్నేల క్రాస్ వద్ద మంత్రి వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, రాష్ట్ర టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ఇంటి దగ్గర కత్తితో హల్‌చల్

హైదరాబాద్, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇంటి దగ్గర కత్తితో వ్యక్తి హల్‌చల్ చేసాడు. జూబ్లీహిల్స్‌లో ఘటన జరిగింది. . ఖమ్మంకు చెందిన బిల్డర్ సుచేతన్ ఠాకూర్ నాయక్‌గా గుర్తించారు. అప్పుల బాధతో ఉన్న తనకు పవన్ కల్యాణ్ ఆర్థిక సాయం చేయాలంటూ నిరసనకు దిగాడు. 16 రోజులుగా పవన్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. బౌన్సర్లపై కత్తితో దాడికి దిగాడు. తనను తాను గాయపరుచుకున్నాడు. అప్రమత్తమైన బౌన్సర్లు కత్తిని లాక్కొని పోలీసులకు అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులు సుచేతన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎర్రి కుక్క ఎవరిని కరిచిందో ప్రజలకు అర్థం అయింది

ఎమ్మెల్యే కోమటిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

తనను ఎర్రి కుక్క కరిచింది అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వరుస మాటల దాడులు కొనసాగాయి. అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ, దుర్మార్గపు పాలన సాగించే పాలకులను తెలంగాణ ప్రజానీకం, చరిత్ర ఎన్నిటికీ క్షమించదని అయన అన్నారు. మూడేళ్లుగా రేవంత్ రెడ్డి భాష చూసి ఎర్రి కుక్క ఎవరిని కరిచిందో ప్రజలకు అర్థం అయింది. అయ్యప్ప మాలలో ఉండి కళ్ళు నెత్తికి ఎక్కి మాట్లాడుతున్నాడు అని నేను అనలేను. ఇప్పటికైనా రేవంత్ రెడ్డికి బుద్ధి ప్రసాదించాలని అయ్యప్ప స్వామిని వేడుకుంటున్నానని అన్నారు

మాదిగ జాతి హక్కుల కోసం మూడు దశాబ్దాల పోరాటం...





నేడు అనారోగ్యంతో ఆసుపత్రి మంచంపై! మేరీ మాదిగను ఆదుకుందాం... జాతి కోసం పోరాడిన బిడ్డకు అండగా నిలుద్దాం!

హైదరాబాద్, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

మాదిగ జాతి హక్కుల సాధన కోసం మూడు దశాబ్దాలుగా పోరాడిన మహిళా ఉద్యమకారిణి, (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి)మహిళా వ్యవస్థాపక సభ్యురాలు మేరీ మాదిగ నేడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకప్పుడు జాతి హక్కుల కోసం పోలీసుల లాఠీ దెబ్బలు తిన్న ఆమెకు నేడు వైద్య చికిత్స కోసం సమాజం అండ అవసరమైంది. 1995లో మాదిగ రిజర్వేషన్ ఉద్యమంలో భాగంగా అప్పటి మంత్రి కడియం శ్రీహరి, హోంమంత్రి దేవేందర్ గౌడ్ తదితరుల దృష్టికి ఏబీసీడీ వర్గీకరణ డిమాండ్‌ను తీసుకెళ్లేందుకు జరిగిన పోరాటాల్లో మేరీ మాదిగ పాల్గొన్నారు. ఈ క్రమంలో పోలీసుల దాడులను ఎదుర్కొన్నారు. 1997లో హైదరాబాద్‌లో అంజమ్మ అనే మహిళపై జరిగిన పోలీసుల దాడికి నిరసనగా, మాదిగ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలను సమీకరించి ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మరోసారి పోలీసుల దాడికి గురయ్యారు. 1998లో ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం జరిగిన అసెంబ్లీ ముట్టడిలో పోలీసులు అత్యంత దారుణంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. రక్తాలు కారేలా కొట్టినా ఉద్యమాన్ని మాత్రం వీడలేదు. ఆ పోరాటాల ఫలితంగా తొలి వర్గీకరణ బిల్లు ఆమోదం పొందగా, 2004లో అమలులోకి వచ్చిందని, దీని ద్వారా సుమారు 22 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే, ఈ వర్గీకరణపై ఈ.వి. చిన్నయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో 2004లో వర్గీకరణ అమలు నిలిచిపోయిందని ఆమె పేర్కొన్నారు. మాదిగ జాతి కోసం జరిగిన పోరాటంలో తనపై జరిగిన దాడులు, జైలు జీవితం, ఎదుర్కొన్న అవమానాలను గుర్తుచేసుకుంటూ మేరీ మాదిగ కన్నీటిపర్యంత మయ్యారు. తనపై కాల్పులు జరపాలంటూ 'కనిపిస్తే కాల్చేయండి' అనే పోస్టర్లు కూడా అప్పట్లో వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బహుజన ఉద్యమ నేత కాన్షీరాం గారితో కలిసి పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. జాతి హక్కుల కోసం పోరాడిన క్రమంలో సుమారు ఆరు నెలలపాటు సెంట్రల్ జైలులో ఉన్నానని, ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నానని తెలిపారు.

నేడు అనారోగ్యంతో పోరాటం... ఆదుకునేవారు కరువు!

ఉద్యమ సమయంలో ఎదురైన దాడులు, శారీరక వేదనల అనంతరం ప్రస్తుతం గర్భసంచికి సంబంధించిన సమస్యతో పాటు కాలేయ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకప్పుడు వేలాది మంది హక్కుల కోసం రోడ్డెక్కిన మహిళా ఉద్యమకారిణి నేడు తన వైద్య చికిత్స, మందుల ఖర్చుల కోసం సహాయం కోరాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. జాతి కోసం జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమకారిణిని ఈ కష్టకాలంలో ఒంటరిగా వదిలేయకూడదు.

జాతి బిడ్డకు మనమంతా అండగా నిలుద్దాం!

మాదిగ జాతి పెద్దలు,(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, దాతలు, మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక విజ్ఞప్తి. మేరీ మాదిగ గారి వైద్య చికిత్స, మందుల ఖర్చుల కోసం మీకు చేతనైనంత ఆర్థిక సహాయం అందించండి. చిన్న సహాయమైనా ఆమెకు ఎంతో విలువైనది. జాతి కోసం పోరాడిన బిడ్డను ఆదుకోవడం మనందరి బాధ్యత.

ఆర్థిక సహాయం చేయదలచిన వారు

ఫోన్‌పే / గూగుల్‌పే నంబర్: 9848148259

బ్యాంకు ఖాతా వివరాలు:

- బ్యాంకు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- శాఖ: తార్నాక
- ఖాతాదారు పేరు: పాలడుగు గౌరమ్మ
- ఖాతా నంబర్: 6230953926
- ఐఎఫ్ఎస్‌సీ కోడ్: (ఎస్ బి ఐ ఎన్ 0020454)

గమనిక: బ్యాంకు ఖాతా పాలడుగు గౌరమ్మ పేరుతో ఉంది. విరాళం పంపే ముందు మేరీ మాదిగ గారి కుటుంబ సభ్యుల ద్వారా ఈ ఖాతా వైద్య సహాయం కోసమేనని నిర్ధారించుకోండి. ఆమె పోరాటాన్ని గుర్తుచేసుకుందాం... ఆమెకు అండగా నిలుద్దాం! జాతి కోసం పోరాడిన వారిని కష్టకాలంలో ఆదుకోవడమే నిజమైన ఉద్యమ స్ఫూర్తి!.

– డా. బరిగెల శివ ఎమ్మెల్సీ అభ్యర్థి
। జై భీమ్ టీవీ ఫౌండర్ & చైర్మన్
। ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులు

రెండు దశాబ్దాల అనుబంధానికి ఆత్మీయ గుర్తు..





చుక్కా రామయ్య సార్‌తో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న డా. బరిగెల శివ విద్యారంగానికి చుక్కా రామయ్య అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం : డా. బరిగెల శివ

హన్మకొండ, నవంబర్ 20(జై భీమ్ న్యూస్)

విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ, ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచిన చుక్కా రామయ్య సార్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకొని 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆయనతో ఉన్న రెండు దశాబ్దాల అనుబంధాన్ని డా. బరిగెల శివ మరోసారి గుర్తుచేసుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భంలో చుక్కా రామయ్య సార్‌ను ఆత్మీయంగా కలుసుకోవడం, ఆనాటి అనుభవాలు, జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఎంతో భావోద్వేగాన్ని, ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. చుక్కా రామయ్య సార్‌తో తనకు దాదాపు రెండు దశాబ్దాల అనుబంధం ఉందని డా. బరిగెల శివ పేర్కొన్నారు. ఆ రోజుల్లో ఆయన వెంట ఉంటూ, వివిధ సందర్భాల్లో కలిసి ప్రయాణిస్తూ, ఆయన వ్యక్తిత్వాన్ని, ఆలోచనా విధానాన్ని, విద్యారంగం పట్ల ఆయనకున్న అపారమైన నిబద్ధతను దగ్గరగా చూసే అవకాశం కలిగిందన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించేందుకు మాత్రమే కాకుండా, సమాజంలో మార్పు తీసుకువచ్చే శక్తివంతమైన సాధనమని చుక్కా రామయ్య సార్ తన జీవిత ప్రయాణం ద్వారా నిరూపించారని కొనియాడారు. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ఆయన చేసిన కృషి, ఎంతోమంది యువతకు విద్యా మార్గదర్శిగా నిలిచిన తీరు, సమాజంలోని పేద మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు విద్య అందించాలనే ఆయన తపన తనకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయనతో గడిపిన ప్రతి సందర్భం తన జీవితంలో విలువైన అనుభవంగా నిలిచిపోయిందన్నారు. రెండు దశాబ్దాల క్రితం చుక్కా రామయ్య సార్‌తో ఏర్పడిన పరిచయాలు, అనుబంధాలను వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ రావు సార్‌తో కలిసి మరోసారి గుర్తుచేసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని డా. బరిగెల శివ తెలిపారు. ఈ ఆత్మీయ కలయికలో రవీందర్ రావు సార్ కూడా పాల్గొనడంతో ఆనాటి సంఘటనలు, ప్రయాణాలు, పరిచయాలు, అనుభవాలు మరోసారి కళ్లముందు కదలాడాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చుక్కా రామయ్య సార్ కుమారుడిని, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ రావు సార్‌ను చిరు సన్మానంతో గౌరవించుకోవడం ఎంతో ఆనందంగా అనిపించిందన్నారు. ఇరవై సంవత్సరాల క్రితం ఏర్పడిన పరిచయాలు, నేటికీ అదే ఆత్మీయతతో కొనసాగడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని చెప్పారు. చుక్కా రామయ్య సార్ వంద సంవత్సరాల జీవిత ప్రయాణం ఎంతోమందికి ఆదర్శమని, విద్యారంగానికి ఆయన అందించిన సేవలు, విద్యార్థుల జీవితాల్లో వెలిగించిన విద్యాజ్యోతులు, సమాజంలో విద్య పట్ల చైతన్యం కల్పించేందుకు చేసిన కృషి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని డా. బరిగెల శివ అన్నారు. ఆయన జీవితంలోని ప్రతి ఘట్టం విద్య పట్ల అంకితభావానికి, సమాజ సేవకు నిదర్శనమని పేర్కొన్నారు. చుక్కా రామయ్య సార్‌తో తనకున్న అనుబంధాన్ని మరోసారి గుర్తుచేసుకునే అవకాశం రావడం జీవితంలో ప్రత్యేకమైన సందర్భంగా భావిస్తున్నానని, ఇలాంటి ఆత్మీయ కలయికలు మనిషి జీవితంలో సంబంధాలు, జ్ఞాపకాలు, విలువలను మరింత బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు, టింకు తదితరులు పాల్గొన్నారు. కాలం ఇరవై సంవత్సరాలు ముందుకు సాగినా.. మనుషుల మధ్య ఏర్పడిన నిజమైన అనుబంధాలు మాత్రం ఎప్పటికీ పాతబడవు. కొన్ని పరిచయాలు, కొన్ని జ్ఞాపకాలు, కొన్ని ఆత్మీయ క్షణాలు జీవితాంతం మనతోనే ప్రయాణిస్తాయని డా. బరిగెల శివ పేర్కొన్నారు.

మెడికల్ షాపులపై టీజీ సేఫ్ మెరుపు దాడులు...14 ప్రాంతాల్లో తనిఖీలు

హైదరాబాద్, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

అలవాటు కలిగించే మత్తు మందుల అక్రమ విక్రయాలు, మళ్లింపును అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ చేపట్టింది. టీజీ సేఫ్ డ్రగ్స్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా నవంబర్ 19న హైదరాబాద్‌లోని మెడికల్ షాపులపై దాడులు నిర్వహించారు. కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. యాంటీబయాటిక్స్ విచ్చలవిడిగా విక్రయించడాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టారు.

లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్ వేళ.. మౌంటెన్ ర్యాట్స్..?

జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లో కరుడుగట్టిన ఉగ్రవాది లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్ వేళ ఓ కమాండో వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. గుబురు గడ్డంతో.. ఖాకీ వస్త్రం తొడుగు ఉన్న ఏకే-203 రైఫిల్, మిలిటరీ గేర్‌తో రగ్గ్డ్ లుక్‌తో ఉన్న ఈ కమాండో వీడియో సోషల్ మీడియాలో కనిపిస్తోంది. ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బంది పేర్ల విషయంలో భద్రతా దళాలు గోప్యత పాటిస్తాయి. అయితే, అతడి డ్రెస్‌పై ఉన్న బ్యాడ్జ్ ఆధారంగా సైన్యంలోనే అత్యంత శక్తిమంతమైన '9 పారా స్పెషల్ ఫోర్స్' కమాండోగా భావిస్తున్నారు. ఈ బెటాలియన్‌కు 'మౌంటెన్ ర్యాట్స్', 'పైరేట్స్', 'ఘోస్ట్ ఆపరేటర్స్' అనే నిక్‌నేమ్స్ ఉన్నాయి. సైన్యంలో ఈ ఫోర్స్ అత్యంత ప్రత్యేకం. దీని కమాండోలు జమ్మూకశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్స్‌తోపాటు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో చురుగ్గా పాల్గొంటారు. యుద్ధంలోనే దీని పుట్టుక..: 1965లో భారత్-పాక్ యుద్ధం వేళ శత్రు భూభాగాల్లోకి చొచ్చుకెళ్లి మెరుపు దాడులు చేయడానికి సైన్యంలో కర్నల్ మేఘ్ సింగ్ ఓ ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని శిక్షణ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిని మేఘ్‌దూత్ ఫోర్స్‌గా వ్యవహరించేవారు. 1965 యుద్ధంలో 'హాజీ పీర్ బల్జ్' వద్ద ఈ దళం పాక్ స్థావరాలపై మెరుపు దాడులు చేసి.. దాని స్వాధీనానికి మార్గం సుగమం చేసింది. దీని పనితీరు చూసి.. ఈ దళంతో 1966 జులై 1వ తేదీన 9వ పారాచూట్ కమాండో బెటాలియన్ ఏర్పాటు చేశారు. సైన్యంలో ఏర్పాటు చేసిన తొలి స్పెషల్ ఫోర్స్ ఇదే అని చెబుతారు. "మినిమం మెన్.. మ్యాక్సిమమ్ ఇంపాక్ట్" అనేది దీని నినాదం. ఉధంపూర్ కేంద్రంగా పనిచేసే వీరు పర్వత యుద్ధ తంత్రంలో దిట్టలు. దీంతోనే వీరికి 'మౌంటెన్ ర్యాట్స్' అనే పేరు వచ్చింది. చిన్న దళాలుగా వెళ్లి శత్రువులకు భారీ నష్టం చేయడం వీరి శైలి. డిఫెండర్ ఆఫ్ పూంచ్..: 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం వేళ 'ఆపరేషన్ మంధోల్' చేపట్టి.. పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఫిరంగులను ధ్వంసం చేశారు. దీంతో వీరికి 'డిఫెండర్ ఆఫ్ పూంచ్' అనే గౌరవం దక్కింది. శ్రీలంకలో శాంతి పరిరక్షక దళంలో కూడా 9 పారా ఎస్ఎఫ్ కమాండోలు ఉన్నారు. కార్గిల్ యుద్ధంతోపాటు, 2001లో ఆపరేషన్ అపాచీ, 2016 సర్జికల్ స్ట్రైక్స్‌లో ఈ దళం ప్రధాన పాత్ర పోషించింది.

మరియమ్మ మృతి ఘటనపై ఓఖీఖూ పోరాటం..

పోలీసులపై తీవ్ర ఆరోపణలు! ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను విధుల నుంచి తప్పించి ంఅఖ కార్యాలయానికి అటాచ్ చేసిన అధికారులు

చిలకల్లు, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

యాండ్రాతి మరియమ్మ మృతి ఘటనకు సంబంధించి చిలకల్లు పోలీస్ స్టేషన్ ఎస్సై మణికంఠ, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అప్పారావు, బాబురావు, మహిళా కానిస్టేబుల్ రాణి వేధింపులే మరియమ్మ ఆత్మహత్యకు ప్రధాన కారణమని ఓఖీఖూ నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై నియమించబడిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, మైలవరం ఏసీపీ గారి ఎదుట ఓఖీఖూ నాయకులు తమ వద్ద ఉన్న వివరాలను వెల్లడించి, పోలీసుల వేధింపులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓఖీఖూ ప్రధాన నాయకత్వం, ఓఖ జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు మాదిగ, ఓఖ రాష్ట్ర నాయకులు కోట దానియేలు మాదిగ, ఓఖీఖూ ఎన్టీఆర్ జిల్లా మాజీ అధ్యక్షులు ఆదూరి నాగమల్లేశ్వరరావు మాదిగ తదితరులు స్పందిస్తూ, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సైతో పాటు సంబంధిత పోలీసు సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఏసీపీని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మైలవరం ఏసీపీ గారు ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి, సంబంధిత పోలీసు సిబ్బందిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించి నందిగామ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామని, కేసును వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏసీపీ ఇచ్చిన హామీ మేరకు ఓఖీఖూ నాయకత్వం ప్రస్తుతానికి ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే మరియమ్మ కుటుంబానికి న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖా నాయక్ ఇళ్లలో ఈడీ సోదాలు

హైదరాబాద్, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖా నాయక్ ఇళ్లలో ఈడీ సోదాలు కలకలం రేపాయి. శుక్రవారం నాడు ఏకకాలం రెండు చోట్ల ఏకకాలంలో ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రూ.40.96 కోట్ల సీఎంఆర్ ధాన్యం అక్రమాల కేసులో సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. సత్తెనపల్లిలో రేఖా నాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో భారీగా ధాన్యం మాయం అయింది. 2022-23, 2023-24, 2024-25 యాసంగి సీజన్లలో ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. గతంలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన తనిఖీల్లో ఈ రైస్ మిల్లులో ఏకంగా 9,639.962 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు స్పష్టంగా తేలింది. ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.40.96 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. రేఖా నాయక్‌పై గతంలోనే ఃఔ సెక్షన్లు 316(2), 316(5), 318(4), నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదు అయింది. ధాన్యం గోల్‌మాల్‌లో మనీలాండరింగ్ కోణంపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. పక్కదారి పట్టించిన ధాన్యం ద్వారా సమకూరిన అక్రమ నిధులను ఎక్కడికి మళ్లించారు, వాటిని ఏయే ఆస్తుల్లో పెట్టుబడిగా పెట్టారు అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. తనిఖీల్లో భాగంగా బ్యాంకు ఖాతాల వివరాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోదాలు పూర్తయిన అనంతరం ఈ వ్యవహారంలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

పితాపురంలో 'ఆరంభ్' మోడల్ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం
109 అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణకు శ్రీకారం





పితాపురం, నవంబర్ 20(జై భీమ్ న్యూస్) :

చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యతో పాటు సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని అపోలో ఫౌండేషన్--టోటల్ హెల్త్ ఆధ్వర్యంలో పితాపురంలోని అగ్రహారంలో 'ఆరంభ్' మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వైస్ చైర్‌పర్సన్, సీఎస్ఆర్ విభాగం ప్రతినిధి ఉపాసన కామినేని కొణిదెల అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పితాపురం నియోజకవర్గ పరిధిలో ఒక మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మరో 109 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునికీకరణ, పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. చిన్నారుల మానసిక, శారీరక, సామాజిక వికాసానికి అనుకూలంగా 'ఆరంభ్' మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తీర్చిదిద్దారు. కేంద్రంలో పిల్లలకు అనుకూలమైన తరగతి గదులు, వినూత్న బోధనా పద్ధతులు, ఆట స్థలాలు, మెరుగైన పారిశుధ్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆటల ద్వారా విద్యాబోధన, వయస్సుకు తగిన అభ్యాస కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించే విధానాలకు ప్రాధాన్యత కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించడం కూడా ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పితాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ దార్శనికతకు అనుగుణంగా మహిళా సాధికారత, చిన్నారుల సంక్షేమం, సమాజ అభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు సంస్థల భాగస్వామ్యం తోడైతే గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే లక్ష్యంతో అపోలో ఫౌండేషన్--టోటల్ హెల్త్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో అపోలో ఫౌండేషన్ ప్రతినిధులు, సిబ్బంది, పితాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సంబంధిత శాఖల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, మెరుగైన ఆరోగ్యం, పోషకాహారం అందించడంతో పాటు మహిళల సాధికారతకు ప్రోత్సాహం లభించనుంది.

టేకులపల్లిలో ఇసుక ట్రాక్టర్ బోల్తా..

యువకుడు మృతి..

టేకులపల్లి, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కుటుంబానికి ఆసరాగా ఉన్న భర్తను కోల్పోయి తొమ్మిది నెలల గర్భిణి అయిన భార్య, ఐదేళ్ల కుమార్తె దిక్కులేనివారయ్యారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం గంగారం పంచాయతీ పరిధిలోని చర్లపల్లికి చెందిన మధు ఇసుక ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా అదే పనికి వెళ్లాడు. సంపత్ నగర్ నుంచి టేకులపల్లి వైపు వస్తుండగా అదుపుతప్పిన ఇసుక ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజన్ మధుపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు. ఇసుక ట్రాక్టర్లపై నిఘా ఏదీ?: మండలంలో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు, వాటి వేగంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భర్తను కోల్పోయి తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్న ప్రియ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

జెండా మోసినోళ్లకు గుర్తింపు ఏది?

గౌరు చేరికతో గులాబీ గూటిలో గుబులు!
మేయర్ పీఠం చుట్టూ కొత్త రాజకీయ సమీకరణాలు..
సీనియర్లలో అసంతృప్తి
కొత్తవారికి స్వాగతం.. పాత నాయకుల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకం!

హన్మకొండ, 20 నవంబర్ (జై భీమ్ న్యూస్)

రాజకీయాల్లోకి కొత్త నాయకులు రావడం తప్పు కాదు. పార్టీలు విస్తరించడం సహజమే. కానీ పార్టీ కష్టకాలంలో జెండా మోసిన కార్యకర్తలకు, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన నాయకులకు గుర్తింపు ఎక్కడ? కొత్తగా వచ్చేవారికి స్వాగత తోరణాలు కడుతున్నప్పుడు పాతవారి సేవలను విస్మరిస్తే ఎలా? ఇప్పుడు గ్రేటర్ వరంగల్ బీఆర్ఎస్ రాజకీయాల్లో ఇదే ప్రశ్న చర్చనీయాంశంగా మారింది.ప్రముఖ విద్యావేత్త, ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి బీఆర్ఎస్‌లో చేరనున్నారన్న ప్రచారం గులాబీ శిబిరంలో కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేశ్ ఆయన చేరికకు చొరవ చూపుతున్నారన్న ప్రచారం సాగుతోంది. మరోవైపు నగర మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, నన్నపనేని నరేందర్ వర్గాల్లో అసంతృప్తి ఉందన్న చర్చ వినిపిస్తోంది.

చేరిక వెనుక రాజకీయ వ్యూహమేంటి?

గ్రేటర్ వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో పార్టీ కోసం పనిచేసిన స్థానిక నాయకులతో సంప్రదింపులు లేకుండానే చేరిక వ్యవహారం ముందుకు సాగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త నాయకులను పార్టీలోకి ఆహ్వానించడం పార్టీ విస్తరణలో భాగమే అయినప్పటికీ, స్థానిక నాయకత్వ అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోతే అంతర్గత విభేదాలు పెరిగే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మేయర్ పీఠంపై ప్రచారమే అసలు చిచ్చు!

గౌరు తిరుపతిరెడ్డి చేరిక కంటే ఆయనకు భవిష్యత్తులో గ్రేటర్ వరంగల్ మేయర్ అభ్యర్థిత్వం దక్కవచ్చన్న ప్రచారమే అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఉద్యమకాలం నుంచి పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కష్టకాలంలో కేడర్‌ను కాపాడిన వారు పదవులపై ఆశలు పెట్టుకోవడం సహజం. అలాంటి వారిని పక్కనపెట్టి కొత్తగా వచ్చే వ్యక్తి పేరు మేయర్ అభ్యర్థిగా ప్రచారంలోకి రావడం సీనియర్లలో ఆందోళన కలిగిస్తోందన్న చర్చ సాగుతోంది. అయితే ఈ అభ్యర్థిత్వంపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

పైకి ఐక్యత.. లోలోపల అసంతృప్తి!

ఇటీవల హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గౌరు చేరికను స్వాగతిస్తూ ఒక నాయకుడు మాట్లాడటం, మరో నాయకుడు తన నియోజకవర్గంలోనూ భారీ చేరికలు ఉంటాయని వ్యాఖ్యానించడం రాజకీయంగా చర్చకు దారితీసింది. నియోజకవర్గాల పరిధి, స్థానిక నాయకత్వ ప్రాధాన్యత, చేరికల విషయంలో సమన్వయం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి.కొత్త నాయకుల రాకతో పార్టీకి బలం చేకూరవచ్చు. కానీ పాత నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగితే అదే పార్టీకి బలహీనతగా మారే ప్రమాదం ఉంది. బహిరంగంగా వ్యతిరేకత కనిపించకపోయినా, కీలక సమయంలో నాయకుల సహకారం తగ్గితే ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

గులాబీ గూటికి అసలు పరీక్ష!

బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పుడు కొత్తవారికి ఆహ్వానం పలకడంతో పాటు పాత నాయకుల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే పార్టీకి నాయకులు ముఖచిత్రమైతే, కార్యకర్తలు పునాది. పునాదిని విస్మరించి భవనం నిర్మించాలనుకుంటే అది ఎంతకాలం నిలుస్తుంది?కొత్త నాయకుడికి స్వాగతం పలకడం రాజకీయ వ్యూహం కావచ్చు.. కానీ పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తకు గుర్తింపు ఇవ్వడం నాయకత్వ బాధ్యత!గ్రేటర్ వరంగల్ గులాబీ గూటిలో ఇప్పుడు తేలాల్సిన ప్రశ్న ఒక్కటే.. కొత్తవారికి పదవుల బాట వేస్తారా? లేక పాత నాయకుల సేవలకు తగిన గుర్తింపు ఇస్తారా?

-హన్మకొండ శ్రీకాంత్..
జై భీమ్ అధికార ప్రతినిధి



నోటీసులు బేఖాతరు.. బల్దియా బుల్డోజర్!

వివాదాస్పద భూమిలో ఏసీ రేకుల షెడ్ తొలగింపు
కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు





హనుమకొండ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్)

నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలకు దిగారు. హనుమకొండలోని న్యూశాయంపేట ప్రాంతంలో వివాదాస్పద భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఏసీ రేకుల షెడ్డును గురువారం తొలగించారు.జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ నస్రీన్ బాను ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఈ తొలగింపు చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణంపై గతంలోనే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నారు.

అక్రమ నిర్మాణాలకు ఉపేక్ష లేదు

నగర పరిధిలో మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. భవన నిర్మాణ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీఎస్ ఖురేషీ, డీఆర్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల ప్రేమ.. పెళ్లికి నిరాకరణ.. న్యాయం కోసం యువతి నిరాహార దీక్ష

మంచిర్యాల, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామానికి చెందిన ఎల్లమద్రి అనిత (24), తండ్రి ప్రకాష్, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన యువతి. దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన పాత్లే గౌతమ్ (27), తండ్రి మోహన్, లంబాడీ సామాజిక వర్గానికి చెందిన యువకుడితో గత రెండు సంవత్సరాలుగా పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయం ప్రేమగా మారిందని యువతి తెలిపింది. ఇద్దరూ ప్రేమించుకున్నారని, అయితే ప్రస్తుతం తనను వివాహం చేసుకోవడానికి గౌతమ్ నిరాకరిస్తున్నాడని అనిత ఆరోపిస్తోంది. రెండేళ్లుగా ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు వివాహానికి నిరాకరించడంతో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. నేపథ్యంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలోని పాత్లే గౌతమ్ ఇంటి ముందు అనిత నిరాహార దీక్ష చేపట్టింది. తాను ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన యువతినని, యువకుడు లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని పేర్కొంటూ, కులాలతో సంబంధం లేకుండా తనకు న్యాయం జరగాలని అనిత కోరుతోంది. సంబంధిత అధికారులు, పోలీసు శాఖ స్పందించి ఇరువర్గాల వాదనలు విని సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తోంది.

జల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ, నవంబర్ 20 (జై భీమ్ న్యూస్) :

పల్నాడు వాటర్ గ్రిడ్ పేరుతో నాగార్జునసాగర్ విజయపురి వద్ద, పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న జలాల తరలింపు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. ఈ అంశంపై ఆయన నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. తాగునీటి అవసరాల పేరుతో జలదోపిడీకి తెరలేపుతూ రహస్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గత ఎనిమిది నెలలుగా ఈ పనులు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం, విషయం తెలిసిన తర్వాత కూడా కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఈ జలదోపిడీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల విషయంలో విభజన చట్టాన్ని అమలు చేసి తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను తేల్చాలని కోరారు. తెలంగాణకు చెందిన బీజేపీ మంత్రులు, ఎంపీలు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల' నినాదంతో సాధించుకున్న తెలంగాణలో జలదోపిడీని సహించేది లేదని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎనిమిది నెలలుగా పనులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వీర్లపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులను అరెస్టు చేసి, పోలీసు బందోబస్తు మధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం అమానుషమని మండిపడ్డారు. గిరిజన, దళిత వర్గాలు నివసించే ప్రాంతాల సమీపంలో కాలుష్యకారక పరిశ్రమలను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. వీర్లపాలెంలో ఇథనాల్ పేరుతో నిర్మిస్తున్న పరిశ్రమను వెంటనే నిలిపివేసి, ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల జీవనహక్కులు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM